


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 23-10-2026 | సంపుటి - 31 | సంచిక - 149 | రూ : 4 | పేజీలు: 8

మోదీకి నెతన్యాహు ప్రత్యేక ఆహ్వానం
స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన

- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ జ్యోతిని వెలిగించాలని పిలుపు
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి
- ఉగ్రవాదంపై నేలపైనా, గగనతలంలోనూ పోరాడుతున్నామన్న నేతలు
- పశ్చిమాసియాలో శాంతి స్థాపనపై ఇరు దేశాధినేతల చర్చలు

2లో



బీసీ కులగణనలో
తప్పులుంటే సరిచేస్తాం.. సీఎం ప్రకటన


- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ



హైదరాబాద్ : బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని తరువాయి 2లో

దావూద్ పాక్‌లోనే ఉన్నాడు
ఐరాసలో భారత్ స్పష్టం

- దావూద్ భారత్‌లో ఉన్నాడంటూ ఐరాస నివేదికలో తప్పుడు సమాచారం 2లో
- ఈ నివేదికను తీవ్రంగా ఖండించి, వాస్తవాలను వెల్లడించిన భారత్





టిబెట్‌లో శక్తిమంతమైన భూకంపం..
రిక్టర్ స్కేల్‌పై 7.0 తీవ్రత

- ఉత్తర టిబెట్‌లో భారీ భూకంపం
- భూమికి 10 కిలోమీటర్ల లోతులోనే ప్రకంపనలు
- 2024 తర్వాత చైనాలో ఇదే అత్యంత శక్తివంతమైన భూకంపం
- ప్రాణ, ఆస్తి నష్టంపై ఇంకా వెల్లడికాని వివరాలు
- ఇటీవలి వరదల నుంచి తేరుకోకముందే మరో విపత్తు

చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గురువారం రాత్రి స్థానిక కాలమానం ప్రకారం 10:33 గంటల సమయంలో ఉత్తర టిబెట్‌ను శక్తివంతమైన భూప్రకంపనలు వణికించాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.0గా తరువాయి 2లో

ఆర్థిక సంక్షోభం...
భారత్ సాయాన్ని కొనియాడిన శ్రీలంక

- ఆర్థిక సంక్షోభంలో ఆదుకున్న భారత్‌కు శ్రీలంక మంత్రి కృతజ్ఞతలు
- 2022 నాటి కష్టాల నుంచి పూర్తిగా బయటపడ్డామని వెల్లడి
- భవిష్యత్తులో రుణాల చెల్లింపుపై ఎలాంటి రిస్క్ లేదని ధీమా
- వృద్ధి కోసం 1990ల నాటి భారత సంస్కరణలను ఆదర్శంగా తీసుకుంటామని ప్రకటన
- నిలిచిపోయిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను తిరిగి ప్రారంభిస్తున్నామని వెల్లడి



తమ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తరుణంలో అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి, భారత ప్రజలకు శ్రీలంక ప్రభుత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో పాల్గొన్న శ్రీలంక పరిశ్రమలు, వ్యవస్థాపక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రి చతురంగ అబేసింఘే ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో భారత్ తమకు వెన్నెముకగా నిలిచిందని ఆయన కొనియాడారు. 2022లో శ్రీలంకను చుట్టుముట్టిన తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని అబేసింఘే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఇంధనం, నిత్యావసరాల తీవ్ర కొరతతో పాటు ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటడం, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటడంతో దేశం అల్లకల్లోల స్థితిని ఎదుర్కొందని వివరించారు. “ఆ కష్టకాలం తరువాయి 2లో

వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్..
రూ. 382 కోట్లు మంజూరు..

- వరంగల్ కోట అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలన అనుమతులు
- మొత్తం రూ. 382 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్
- వేయి స్తంభాల గుడి, బస్ టెర్మినల్ వంటి పనులకు ఆమోదం
- ప్రపంచ బ్యాంకు నిధులతో ‘కుడా’ ఆధ్వర్యంలో పనుల నిర్వహణ
- చారిత్రక ప్రదేశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



2లో



తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షా లు..
బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- ఏపీ, తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం
- ఆంధ్రప్రదేశ్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల హెచ్చరిక
- తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి జల్లులు
- ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

సైబర్ దాడుల కలకలం
PHP నుంచి SBI వరకు!

- పీహెచ్‌పీలో రెండు తీవ్ర భద్రతా లోపాలు
- ఈముద్ర కీలను సెకనులోపే ఛేదించిన పరిశోధకులు
- నోడ్.జేఎస్, LiteLL-Mలోనూ భద్రతా సమస్యలు
- రైల్వే వినియోగదారుల డేటాపై అనుమానాలు
- ఏఐ టూల్‌తో 2,250కిపైగా సంస్థల లక్ష్యం
- ఎస్‌బీఐ ఘటనలో 3,897 మంది కస్టమర్ల రికార్డులు బహిర్గతం



ప్రపంచవ్యాప్తంగా సైబర్ భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పీహెచ్‌పీలో తరువాయి 2లో

బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం.. సీఎం ప్రకటన

బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు. తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీడీ జాబితా నుంచి బీసీఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్..

రూ. 382 కోట్లు మంజూరు

కాకతీయ వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండ నగరంలోని కీలక ప్రాంతాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 382 కోట్ల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్, వేయి స్తంభాల ఆలయం పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ వంటి కీలక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో నిర్వహించనుండగా, ప్రాజెక్టుల అమలుకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. వరంగల్ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పర్యాటక రంగంలో వరంగల్ నగరానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు, నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

మోదీకి నెతన్యాహు ప్రత్యేక ఆహ్వానం

స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ నుంచి ఒక అరుదైన గౌరవం లభించింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా మోదీని ఆహ్వానించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి ఈ జ్యోతిని వెలిగించాలని కోరడం ఈ ఆహ్వానంలోని విశేషం. గురువారం ఇరువురు నేతలు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. భారత్, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. గత సెప్టెంబర్‌లో దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న 'ఫ్లైదుబాయ్' విమానంలో తన సహ పైలట్ జరీపిన దాడిని భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీరోచితంగా అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, దాడి చేసిన వ్యక్తిని సిబ్బందికి అప్పగించడమే కాకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. "ఇజ్రాయెల్, భారత్ సహా యావత్ ప్రపంచానికే ఆయన ఒక హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఆయన సాహసాన్ని గౌరవిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఈ సంభాషణలో భాగంగా ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, అక్కడ శాంతి, స్థిరత్వం నెలకొల్పాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

ఆర్థిక సంక్షోభం

భారత్ సాయాన్ని కొనియాడిన శ్రీలంక

తమ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తరుణంలో అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి, భారత ప్రజలకు శ్రీలంక ప్రభుత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో పాల్గొన్న శ్రీలంక పరిశ్రమలు, వ్యవస్థాపక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రి చతురంగ అబేసింఘే ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో భారత్ తమకు వెన్నెముకగా నిలిచిందని ఆయన కొనియాడారు. 2022లో శ్రీలంకను చుట్టుముట్టిన తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని అబేసింఘే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఇంధనం, నిత్యావసరాల తీవ్ర కొరతతో పాటు ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటడం, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటడంతో దేశం అల్లకల్లోల స్థితిని ఎదుర్కొందని వివరించారు. "ఆ కష్టకాలంలో మాకు తోడుగా నిలిచిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా ధన్యవాదాలు. మీరు అందించిన ఆర్థిక సహాయం సంక్షోభం నుంచి గట్టెక్కడానికి మాకు ఎంతగానో దోహదపడింది" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీలంక సంక్షోభం నుంచి పూర్తిగా కోలుకుందని, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని అబేసింఘే తెలిపారు. రుణాల పునర్‌వ్యవస్థీకరణతో పాటు భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కీలక సంస్కరణలు ప్రవేశపెట్టామని వివరించారు. భవిష్యత్తులో రుణ చెల్లింపుల విషయంలో ఎటువంటి రిస్క్ ఉండదని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఇకపై దేశాన్ని స్థిరత్వం నుంచి వృద్ధి పథం వైపు నడిపిస్తామని, ఇందులో మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు. 1990లలో భారత్ క్రమంగా తన మార్కెట్లను తెరిచిన విధానం తమకు ఒక ఆదర్శమని అభిప్రాయపడ్డారు. పారా టారిఫ్‌లను తొలగించడం, మరిన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి చర్యలతో వృద్ధిని సాధిస్తామని చెప్పారు. 2019 నుంచి నిలిచిపోయిన అనేక ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి ప్రారంభిస్తున్నామని, రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో పారిశ్రామిక, ఆర్థిక మార్పుల కోసం ఇతర దేశాలతో భాగస్వామ్యానికి సిద్ధంగా ఉన్నామని అబేసింఘే స్పష్టం చేశారు.

టిబెట్‌లో శక్తిమంతమైన భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 7.0 తీవ్రత

చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గురువారం రాత్రి స్థానిక కాలమానం ప్రకారం 10:33 గంటల సమయంలో ఉత్తర టిబెట్‌ను శక్తివంతమైన భూప్రకంపనలు వణికించాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.0గా నమోదైనట్లు చైనా భూకంప కేంద్రం (CENC) వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం రాత్రి 8:03 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉత్తర టిబెట్‌లోని నాగ్చు నగర పరిధిలో గల బాచెన్ కౌంటీలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భూమికి కేవలం 10 కిలోమీటర్ల లోతులోనే ఇది సంభవించడంతో ప్రకంపనల ప్రభావం అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, అమెరికా జియోలాజికల్ సర్వే (USGS) మాత్రం భూకంపం 18 కిలోమీటర్ల లోతులో సంభవించినట్లు పేర్కొంది. భూకంప కేంద్రం ఉన్న ప్రాంతం సముద్ర మట్టానికి సగటున 4,864 మీటర్ల ఎత్తులో ఉంది. చైనాలో 2024 జనవరి తర్వాత నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం ఇదేనని అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తక్షణమే తెలియరాలేదు. ఆ ప్రాంతంలో జనాభా చాలా తక్కువగా ఉండటంతో పూర్తి వివరాలు అందడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ప్రధాన భూకంపం తర్వాత 5.0 నుంచి 5.2 తీవ్రతతో పలుమార్లు స్వల్ప ప్రకంపనలు కూడా నమోదయ్యాయి. ఇటీవల టిబెట్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన భారీ వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల నుంచి ఆ ప్రాంతం ఇంకా తేరుకోకముందే ఈ భూకంపం రావడం ఆందోళన కలిగిస్తోంది. ఆగస్టులో హిమానీనదం కూలిపోవడం వల్ల జరిగిన ఆ విపత్తులో 1,400 మందికి పైగా మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారు. భారత, యురేషియా టెక్టోనిక్ ప్లేట్లు ఒకదానికొకటి ఢీకొనడం వల్లే హిమాలయ ప్రాంతంలో భూకంపాలు తరచుగా సంభవిస్తాయని భూగర్భ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ప్రస్తుతం అధికారులు సహాయక చర్యలపై దృష్టి సారించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సైబర్ దాడుల కలకలం: PHP నుంచి SBI వరకు!

ప్రపంచవ్యాప్తంగా సైబర్ భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పీహెచ్‌పీలో ప్రమాదకర లోపాలు, భారత సంస్థ ఈముద్ర సెక్యూరిటీ కీల్లో బలహీనతలు, ఏఐ టూల్స్ ద్వారా హ్యాకింగ్ దాడులు వెలుగులోకి వచ్చాయి. మరోవైపు ఎస్‌బీఐకి చెందిన 3,897 మంది కస్టమర్ల రికార్డులు బహిర్గతమైనట్లు బ్యాంకు ధ్రువీకరించింది. గత 24 గంటల్లో వరుసగా బయటపడిన ఈ ఘటనలు డిజిటల్ వ్యవస్థల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

పీహెచ్‌పీలో ప్రమాదకర లోపాలు

ప్రపంచంలోని దాదాపు 70 శాతం వెబ్‌సైట్లు పీహెచ్‌పీని ఉపయోగిస్తున్నట్లు డబ్ల్యూ3టెక్ అంచనా. ఈ ప్రోగ్రామింగ్ భాషలో గుర్తించిన రెండు కీలక లోపాలను 'PHP2Shell'గా పిలుస్తున్నారు. వీటి ద్వారా హ్యాకర్లు ప్రభావిత వెబ్ సర్వర్లపై నియంత్రణ సాధించే ప్రమాదం ఉంది. అమెరికా జాతీయ భద్రతా సంస్థ ఎన్ఎస్ఏ, ఎఫ్‌బీఐ వెంటనే భద్రతా అప్‌డేట్లు ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించాయి. అప్‌డేట్ సాధ్యం కాకపోతే సమస్య పరిష్కారమయ్యే వరకు వ్యవస్థలను ఆఫ్‌లైన్‌లో ఉంచాలని హెచ్చరించాయి. పీహెచ్‌పీ ఫౌండేషన్ అక్టోబర్ 21న అత్యవసర అప్‌డేట్‌ను విడుదల చేసింది.

ఈముద్ర సెక్యూరిటీ కీల్లో బలహీనతలు

భారత డిజిటల్ సర్టిఫికెట్ సంస్థ ఈముద్ర ఉపయోగించిన ఎనిమిది ప్రైవేట్ కీలు అత్యంత బలహీనంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఒక్క బైట్‌తో సూచించగల సంఖ్యలుగా ఉన్న ఈ కీలను సెకనులోపే ఛేదించగలిగారు. ఇలాంటి లోపాలు నకిలీ సర్టిఫికెట్ల జారీకి, అసలైన వెబ్‌సైట్ల పేరుతో మోసాలకు దారితీయవచ్చు. యాపిల్, గూగుల్, మొజిల్లా ప్రభావిత సర్టిఫికెట్లను తమ బ్రౌజర్లలో బ్లాక్ చేశాయి. క్లౌడ్‌ఫ్లేర్ కూడా అత్యవసర భద్రతా చర్యలు చేపట్టింది. ఎనిమిది సర్టిఫికెట్లలో ఒక్కటే వాస్తవ వినియోగంలో ఉందని, వాటితో వ్యక్తిగత వెబ్‌సైట్లకు సర్టిఫికెట్లు జారీ చేయలేదని ఈముద్ర తెలిపింది. వినియోగదారులు బ్రౌజర్లు, ఆపరేటింగ్ సిస్టమ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

ఏఐ టూల్స్ ద్వారా హ్యాకింగ్ దాడులు

నోడ్.జేఎస్‌లో నాలుగు అధిక తీవ్రత భద్రతా లోపాలను పరిష్కరిస్తూ కొత్త అప్‌డేట్లు విడుదలయ్యాయి. మరోవైపు, ఏఐ సేవలకు అనుసంధానంగా పనిచేసే LiteLLMలో హానికరమైన కోడ్‌ను చొప్పించినట్లు భద్రతా సంస్థ విజ్ వెల్లడించింది. దీనివల్ల డెవలపర్ల రహస్య సమాచారం, క్లౌడ్ ఆధారాలు, బ్రౌజర్ డేటా చోరీ అయ్యే ప్రమాదం ఉంది. క్లౌడ్ సంస్థ రైల్వేలోనూ వినియోగదారుల సున్నిత సమాచారం అనధికార వ్యక్తులకు చేరి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. వినియోగదారులు తమ ఏపీఐ కీలను, ఇతర రహస్య ఆధారాలను మార్చుకోవాలని సంస్థ సూచించింది.

2,250కిపైగా సంస్థలు లక్ష్యం

చైనాతో సంబంధాలున్న హ్యాకింగ్ బృందం ఏఐ ఆధారిత టూల్‌ను ఉపయోగించి కనెక్ట్‌వైజ్ క్లౌడ్ బ్యాకప్ ద్వారా 2,250కిపైగా సంస్థల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు మైక్రోసాఫ్ట్ తెలిపింది. సంస్థలు అనుమానాస్పద లాగిన్‌లను పరిశీలించాలని, సంబంధిత కనెక్షన్లను నిలిపివేయాలని సూచించింది. ఎస్‌బీఐపై జరిగిన సైబర్ దాడిలో 3,897 మంది కస్టమర్ల రికార్డులు బహిర్గతమైనట్లు బ్యాంకు ధ్రువీకరించింది. వరుస ఘటనల నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, బలమైన సెక్యూరిటీ కీలు, నిరంతర పర్యవేక్షణ అత్యంత కీలకంగా మారాయి.

దావూద్ పాక్‌లోనే ఉన్నాడు: ఐరాసలో భారత్ స్పష్టం

ఉగ్రవాదం, మానవ హక్కులపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రత్యేక ప్రతినిధి రూపొందించిన నివేదికలో ఉన్న వాస్తవ దోషాలను భారత్ ఖండించింది. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ దావూద్ ఇబ్రహీం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నాడంటూ నివేదికలో పేర్కొనడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఐరాస వంటి ప్రపంచ స్థాయి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి అబద్ధాలను ప్రచురించినందుకు జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేసింది. ఉగ్రవాద నిరోధం, మానవ హక్కులపై ఐరాస ప్రత్యేక ప్రతినిధి బెన్ సాల్ జులైలో విడుదల చేసిన తన నివేదికలో.. అల్‌ఖైదాతో సంబంధాలున్నందుకు భద్రతా మండలి 2003లో 'డి కంపెనీ' నేత దావూద్ ఇబ్రహీంను జాబితాలో చేర్చిందని, అతను భారత్‌లోనే ఉన్నాడని పరోక్షంగా సూచించారు. ఐరాస సమావేశంలో ఈ అంశంపై భారత శాశ్వత ప్రతినిధి బృందంలోని ఫస్ట్ సెక్రటరీ రాఘూ పూరి మాట్లాడుతూ, నివేదికలోని తప్పులను సరిదిద్దారు. "రికార్డుల కోసం నేను ఈ విషయాన్ని సరిచేస్తున్నాను. ఈ వ్యక్తిని 2003లో జాబితాలో చేర్చడానికి చాలా కాలం ముందే అతను భారత్ నుంచి పారిపోయాడు. విదేశీ గడ్డపై నుంచే అల్ ఖైదా, ఒసామా బిన్ లాడెన్‌తో సంబంధాలున్న కారణంగా అతనిని జాబితాలో చేర్చారు" అని రాఘూ పూరి స్పష్టం చేశారు. "ఈ రోజు వరకు, అతను మా దేశంలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్. ఐక్యరాజ్యసమితి లిస్టింగ్ ప్రకారం, ఒసామా బిన్ లాడెన్‌ను కనుగొని, మట్టుబెట్టిన దేశంలోనే (పాకిస్తాన్) అతను నివసిస్తున్నాడు" అని పాకిస్తాన్‌లోని అబొట్టాబాద్‌ను ఉద్దేశించి ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. నివేదికలోని లోపాలను మరింత వివరిస్తూ.. "1993 ముంబై వరుస పేలుళ్ల తర్వాత నుంచే దావూద్ ఇబ్రహీం ఉగ్రవాద కార్యకలాపాల కోసం భారత్‌కు అవసరమైన వాంటెడ్ క్రిమినల్. 1267 ఆంక్షల కమిటీ జాబితాలో ఈ విషయం స్పష్టంగా ఉంది. అలాంటి కీలకమైన వాస్తవాన్ని నివేదికలో ప్రస్తావించకపోవడం చాలా దురదృష్టకరం. ప్రత్యేక ప్రతినిధుల కార్యాలయం నుంచి ఇలాంటి అసమర్థత ఐరాస ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగిస్తుంది" అని పూరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నివేదికలోని కొన్ని భాగాల్లో స్పష్టమైన పక్షపాతం కనిపిస్తోందని, ఈ కార్యాలయంపై మీడియాలో వస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని భారత్ పేర్కొంది. అత్యున్నత ప్రమాణాలతో నిష్పాక్షికంగా వ్యవహరించాలని కోరింది. "ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే దేశాలు, తమ తప్పుడు పనులను సమర్థించుకోవడానికి మానవ హక్కుల చట్రాన్ని వాడుకోవడం ఒక ఫ్యాషన్‌గా మారిందనిపిస్తోంది" అని పాకిస్తాన్‌ను ఉద్దేశించి ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 26/11 ముంబై దాడులతో సహా అనేక ఉగ్రవాద కేసుల్లో నిందితులు పాకిస్తాన్‌లో దశాబ్దాలుగా స్వేచ్ఛగా జీవిస్తున్నారని, అంతర్జాతీయ సమాజం ఆర్థిక సహాయం నిలిపివేస్తుందనే ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రమే పాక్ వారిపై నామమాత్రపు చర్యలు తీసుకుంటుందని భారత్ ఎప్పటినుంచో ఆరోపిస్తోంది.

తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు.. బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో అక్టోబర్ 23న (శుక్రవారం) మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది. థాయ్‌లాండ్ గల్ఫ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఆవర్తనానికి అనుబంధంగా ఈ వ్యవస్థ బలపడుతోంది. ఇది ఉత్తర అండమాన్ సముద్రం వైపు కదిలి, ఆ తర్వాత పశ్చిమవాయవ్య దిశగా ప్రయాణించనుంది. దీని గమనం, తీవ్రతను బట్టి రెండు రాష్ట్రాలపై వాతావరణ ప్రభావం ఆధారపడి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వర్ష హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నేడు, రేపు (22, 23వ తేదీల్లో) కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు తదుపరి సూచనలు అందే వరకు వేటకు వెళ్లవద్దని సూచించింది.

తెలంగాణలో తేలికపాటి జల్లులు

ఇక తెలంగాణలోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడే కొద్దీ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడటం వంటివి చేయరాదని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కోత కోసిన పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని అధికారులు కోరుతున్నారు.

ఎల్‌నినో ప్రభావం.. నీరు, విద్యుత్ పొదుపు చేయాలి

*** ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి):ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని కోరారు.తాగునీరు, సాగునీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించాలని కలెక్టర్ సూచించారు.వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాలను నిలిపివేసి విద్యుత్ ఆదాకు సహకరించాలని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.నీరు, విద్యుత్ పొదుపును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు.

వడ్డీ సకాలంలో చెల్లించి రాయితీ పొందండి

*** చైర్మన్ మండే వీర హనుమంతరావు**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం:చుంచుపల్లి మండలం లో హౌసింగ్ బోర్డు గ్రామం నందు గల కొత్తగూడెం సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షులు మండే వీర హనుమంతరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించబడింది .ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రైతులు తీసుకున్న పంట రుణాల మీద వడ్డీని సకాలంలో చెల్లించి ప్రభుత్వం నుండి వచ్చు రాయితీలను పొందాలని , సొసైటీ నూతన కార్యాలయం నిర్మాణము కొరకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ,ఎంపీ రామసహాయం రఘు రామ్ రెడ్డి లను నిధులు మంజూరు చేయవలసిందిగా కోరుతూ ,దీర్ఘకాలిక రుణముల క్రింద గేదెలు,గొర్రెలు,మేకలు , వ్యవసాయ పరికరముల నిమిత్తం సొసైటీ కార్యాలయంలో సంప్రదించగలరని ఆయన సూచిస్తూ , వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ఎనిమిది వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ కార్యాలయం సీనియర్ ఇన్స్పెక్టర్ .మధుసూదన్ రావు, డిసిసిబి కొత్తగూడెం బ్రాంచి మేనేజర్ రాగమయి సూపర్ వైజర్ సురేష్ ,సంఘ డైరెక్టర్లు మల్లేష్ , వెంకటేశ్వరరావు , సత్యనారాయణ , చందర్ , రామచంద్రా రావు , విజయకుమారి , విజయ , కార్యాలయ సీఈవో రెడ్డి , రైతులు ,సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల లక్కి డ్రా లో బుల్లెట్ వాహనం గెలుపొందిన విజిత



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలోని పిఎస్ఆర్ సెంటర్లో శ్రీ దుర్గామాత యూత్ అసోసియేషన్ ఐదవ నవరాత్రి వార్షికోత్సవం సందర్భంగా జరిగిన లక్కీ డ్రాలో బుల్లెట్ వాహనాన్ని పొట్లపహాడుకు చెందిన మేకపోతుల విజిత, పల్సర్ బైక్ ను సూర్య గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు అభినందనలు తెలియజేసి వాహనాన్ని అందజేశారు. నిర్వాహకులు అంతటి అనిల్ మాట్లాడుతూ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌరవ సలహాదారులు కౌన్సిలర్ బైరు శైలేందర్ ,బిఆర్ఎస్ నాయకులు అనంతుల దుర్గాప్రసాద్ కు వారు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ ఎంపిటిసి సీతారాములు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాల్లో భాగస్వామ్యమే అభివృద్ధికి బాట



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: ముదిరాజుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అధిక జనాభా కలిగిన ముదిరాజులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, వారి జనాభాకు అనుగుణంగా సంక్షేమ ఫలాలు అందించాలని అన్నారు.గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ సాయన్న పోరాట స్ఫూర్తిని వివరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ ముదిరాజుల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సాయి శ్రీజ, అడిషనల్ కలెక్టర్ పురుషోత్తం,సహదేవ్ ముదిరాజ్,కొత్తూరు రమేష్,కొండ్ర ఎల్లయ్య,డాక్టర్ పరికిపండ్ల అశోక్, సూరబోయిన రవి, అలువాల సోమయ్య,నీరుటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాభవాని శోభాయాత్ర



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: పట్టణంలోని బీట్ మార్కెట్ శ్రీ రామకోటి స్తూప దేవాలయంలో నెలకొల్పిన దుర్గ భవాని అమ్మవారికి నవరాత్రులు వివిధ అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రను నగర మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం బ్రహ్మం గురూజీ కోలాట బృందం ఆధ్వర్యంలో మహిళలు భక్తులు కోలాట ప్రదర్శన నిర్వహిస్తూ వివిధ కోడళ్ల ద్వారా శోభాయాత్ర నిర్వహించి రామాలయం వరకు చేరుకున్నారు అనంతరం అక్కడ కోలాట బృందంలోని మహిళలకు స్కంద హాస్పిటల్ డాక్టర్లు సోంబాబు రాగ మాలిక లో బహుమతి ప్రధానం చేశారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ బండారు వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హడ్ హాక్ కమిటీ కన్వీనర్ రేపాల భద్రాద్రి రాములు, కో కన్వీనర్ గుడిపాడు సత్యనారాయణ, జెగిని శరత్ బాబు, ఆరూరి సత్యనారాయణ, గజవెల్లి సత్యం, తాళ్లపల్లి శ్రీనివాసులు, శివకోటి నెహ్రూ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ యామ కవిత దయాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీను, కార్పొరేటర్ లింగస్వామి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :ప్రభుత్వ విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మన్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగి తండ్రి నుంచి రూ.6 లక్షలు వసూలు చేసి, ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసిన ఘటనపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్ఓ బి. సునీల్ కుమార్ తెలిపారు. బాధితుడు బోయినపల్లి నర్సయ్య (52), బోథ్ మండలం సోనాల గ్రామానికి చెందిన వ్యక్తి. సుమారు నాలుగేళ్ల క్రితం ఆదిలాబాద్ శాంతినగర్‌కు చెందిన నిందితుడు అందుగుల రాజేందర్ తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తన కుమారుడికి విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మన్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన రాజేందర్, ఇందుకోసం రూ.10 లక్షలు అవసరమవుతాయని చెప్పాడు. దీంతో బాధితుడు ముందుగా రూ.6 లక్షలు చెల్లించేందుకు అంగీకరించి, ఫోన్‌పే ద్వారా రూ.3.85 లక్షలు, విడతల వారీగా మరో రూ.2.15 లక్షలు చెల్లించాడు. అయితే, ఉద్యోగం ఇప్పించకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, డబ్బులు తిరిగి చెల్లిస్తానని రాజేందర్ అంగీకరించాడు. ఇప్పటివరకు రూ.1.27 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించగా, మిగిలిన రూ.4.73 లక్షలు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో బాధితుడు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, నిందితుడు నిరాకరించడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అందుగుల రాజేందర్‌పై కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు చేపడుతున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్ఓ బి.సునీల్ కుమార్ తెలిపారు.

ప్రజలకు సూచన

ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగే వ్యక్తులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు అధికారిక ప్రక్రియ ద్వారానే జరుగుతాయని గుర్తించి, ఇలాంటి ప్రలోభాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి. ఇతనిచే బాధింపబడ్డ బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా జిల్లా పోలీస్ శాఖను సంప్రదించవచ్చని తెలిపారు.

భద్రత లేని సేవలతో ఆరోగ్య వ్యవస్థకు వెన్నుదన్ను



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్‌లో 20 ఏళ్లుగా 78 క్యాడర్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరోగ్య, భద్రత లేదని, హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ సెంటర్ లో, ఎన్ హెచ్ ఎం జాక్ ఆధ్వర్యంలో 10 రోజులుగా జరుగుతున్న నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి,ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, క్యాడర్ ఫిక్సేషన్ చేసి 100% శాలరీ ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలను 31% నుండి 70% కి పెంచి, మాతా,శిశు మరణాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందికి భద్రత లేకపోవడం బాధాకరమని అన్నారు.హిమాచల్ ప్రదేశ్,హర్యానా, పంజాబ్,మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో క్రమబద్ధీకరణ చేశారని, తెలంగాణలో చలనం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం నాయకులు ఉమాకర్, శ్రీకాంత్, రాజకుమార్,తార, సుమలత,రమ్య, రాజేశ్వరి,పవన్, వెంకట్,సరిత, లలిత,అరుణ, విజయ్ కుమారి, వనిత,రజిత, మరియమ్మ,పద్మా బాయ్,జ్యోతి, కటాక్షమి,శివరాణి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా బీసీ ప్రజలు గెలిపించేందుకేనా..గద్దెనెక్కనివ్వరా..?



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం జిల్లా :ఖమ్మం జిల్లా బిసి ప్రజలు ఓటేసి గెలిపించేందుకే పనికి వస్తారు. కానీ గద్దెనెక్కి పరిపాలించడానికి పనికిరారా అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి యలమందల జగదీష్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 60 శాతం ఉన్న బీసీ ప్రజలు ఓట్లు వేసి పాలకులను గెలిపించేందుకే కానీ పాలించడానికి పనికి రారా!, ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉన్నా బీసీలకు జరిగిన న్యాయం ఇదేనా. 2014, 2018,2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే ,ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ మంత్రి పదవి కూడా ఒక్క బీసీ కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గవర్నర్ కోటాలో డాక్టర్ లోకేష్ యాదవ్ , ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్, పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో బీసీలకు న్యాయం చేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఉద్యమానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు సతీష్ యాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నాయి బ్రాహ్మణ సేవా సంఘం, ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ , బత్తుల వీరబాబు, పగడాల హనుమంతరావు, రాగం కోటి , నాగరాజు, వినయ్, వంశీ , ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరతకు చెక్, లాభాల పంటకు బాట




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్రవ్యాప్తంగా ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహబూబాబాద్ లోని ఏటిగడ్డ తండా రైతు వేదిక నుండి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ ఇస్లావత్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సూపర్ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేనందున, వచ్చే సీజన్ లో వరి వంటి అధిక నీరు అవసరమయ్యే పంటలు వేయవద్దని సూచించారు. ఆరుతడి పంటలు, అపరాలు, ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలు వేసి, లాభాలు పొందాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు, పంట మార్పిడిపై క్షేత్రస్థాయిలో పాటల రూపంలో అవగాహన కల్పిస్తున్నామని, అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి డా. కిరణ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న, మార్కెటింగ్ అధికారి నరేందర్, భూగర్భ జల శాఖ అధికారి రవి, ఏడీ శ్రీనివాస్, ఏవో తిరుపతి రెడ్డి, శాంతి ప్రియదర్శిని, రైతులు కృష్ణా రెడ్డి, సత్యనారాయణ, సాంస్కృతిక సారథి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ , ఎంపీ వద్దిరాజు కు దసరా శుభాకాంక్షలు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :టీబీజీకేఏస్ యూనియన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను హైదరాబాద్ లో తెలంగాణ భవన్ లో గురువారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానిస్తూ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సింగరేణి సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షులు రాజిరెడ్డి,ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కుసాన వీరభద్రం నాయకులు ,ఊకంటి ప్రభాకర్ రావు,జీ.కే.సంపత్ కుమార్,నాగెళ్లి వెంకటేశ్వర్లు,గడప రాజయ్య, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్నకు షాద్‌నగర్ జాతీయ బీసీ జనసేన ఘన నివాళులు



ప్రజాస్ఫూర్తి, షాద్‌నగర్: పాలమూరు వీరుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా జాతీయ బీసీ జనసేన ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పండుగ సాయన్న చేసిన సేవలను, సమాజం కోసం ఆయన సాగించిన పోరాటాన్ని స్మరించుకున్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఐకమత్యంతో పనిచేస్తూ, పండుగ సాయన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర అప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రవంతి రాజ్, నియోజకవర్గ అధ్యక్షురాలు జక్కుల జలజ, రాష్ట్ర నాయకులు మేకల వెంకటేష్, వెంకటయ్య టీచర్, నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డమీద రమేష్, తంగేడి పల్లి శంకర్‌తో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొని పండుగ సాయన్నకు ఘనంగా నివాళులర్పించారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దేవీ నవరాత్రులు

*** ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**



ప్రజా స్ఫూర్తి ,షాద్నగర్: కొత్తూరు మండల పరిధిలోని ఇన్మూల్ నార్వ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన,అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దేవీ నవరాత్రులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజయ్ నాయక్, నాయకులు ఇంద్రసేన రెడ్డి,శ్యామ్ సుందర్ రెడ్డి,కే.కుమార్,పి. గణేష్,సతీష్ గుప్తా,కేతావత్ నరసింహ,ఎస్.శంకర్,పి. మోహన్ నాయక్,మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న



భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి):ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐలు కాశీరాం, పూర్ణచందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలే అడవి బిడ్డలకు రక్షణ కవచం



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి: కొమరం భీమ్ స్ఫూర్తితో,ఆదివాసీ గిరిజన హక్కుల కోసం ఐక్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని,గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద,ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమరం భీమ్ జయంతి సందర్భంగా,దళిత, గిరిజన విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం కోసం ఉన్న పీసా చట్టం,1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, ఐదు, ఆరు షెడ్యూళ్లలోని ప్రత్యేక చట్టాలను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.అడవిలో ఉన్న ఆదివాసీలను, అక్కడ ఉన్న ఖనిజాల పేరుతో కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం సరికాదని అన్నారు. అడవి నుండి వారిని తరిమివేయడం, నిర్వాసితులుగా చేయడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమాజానికి ఆక్సిజన్ లాంటి ఆదివాసీలను అణగదొక్కడం బాధాకరమని, వారిపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని,చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్వ హక్కులు అడవిలో ఉన్న ఆదివాసీలకే చెందుతాయని, వాటిని కాపాడుకోవడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు వెంకన్న నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చాగంటి ప్రభాకర్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తప్పెట్ల వీరన్న, ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుంపల్లి అనిల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవత్ హేమా నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మంగీలాల్ నాయక్, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు పోలేపాక వెంకన్న, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు నాయక్, జాతీయ కోర్ కమిటీ నాయకులు మోతీలాల్ నాయక్, సుమలత, పద్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

భైంసా పశువుల సంత ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని పశువుల సంతలో రూ. 31 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు.అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ ఆధ్వర్యంలోని పాలకవర్గం పదవీకాలం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు అందించిన సేవలను, మార్కెట్ కమిటీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. రైతుల సంక్షేమం కోసం చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ చేసిన సేవలను అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ సిందే ఆనందరావు పటేల్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే పాలకవర్గం పదవీకాలం ముగింపు సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అక్కడ ఉన్న అధికారులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ , డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికలను పురస్కరించుకొని బీఆర్ఎస్ పొనుగోడు గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ నమోదు కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు, నాలుగువేల రూపాయల నిరుద్యోగ భృతినీ ఇస్తామని మోస పూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక యువతని పూర్తిగా మర్చిపోయారన్నారు. చదువుకునే విద్యార్థినిలకు స్కూటీ లు ఇస్తామని చెప్పి వారిని కూడా మభ్య పెట్టారన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి యేట టీఎస్పిఎస్సి ద్వారా వేలాది ఉద్యోగాలు భర్తీ చేస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఒక భారీ నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడం వారి అసమర్థ పాలనకి నిదర్శనం అన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకొని ఓటు హక్కునీ వినియోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. నిరుద్యోగుల పక్షాన నిరంతరం పోరాడే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెళ్ళచెరువు వెంకటరమణ, మాజీ అధికార ప్రతినిధి రామ్, సైదులు, వార్డు మెంబర్లు అనంతు కరుణాకర్ గౌడ్, రామ్ మధు, నాయకులు బిల్లా వెంకటేశ్వర్లు, అనంతు చంద్రయ్య గౌడ్, నందిపాటి నరహరి, రామ్ సతీష్, పొలంపల్లి మహా అంజనేయులు, బత్తినీ మహేష్, రామ్ సంపత్, మామిడి నవీన్, కురి శివ,చామకూరి సైదులు, నందిపాటి కార్తిక్, నందిపాటి శ్రవణ్, రణపంగ సుందర్, పృధ్వీ,తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధిక సంఖ్యలో పాస్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కమిటీ అధ్యక్షులుగా దుబాస్ యోసేపు ,ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి జోసెఫ్ , కార్యదర్శిగా నూకపంగు ప్రభుకిరణ్ , జాయింట్ సెక్రటరీగా శ్రీకాంత్, కోశాధికారిగా బండారు సాల్మన్ రాజు,కమిటీ బాధ్యులుగా మండల చైర్మన్‌గా అమరారపు పౌలు గౌరవ అధ్యక్షులుగా జాకపు రాజు కరుణాకర్ రెడ్డి ఇమ్మానియేల్ గౌరవ సలహాదారులుగా మీసాల పుష్పరాజు సుధాకర్ గాబ్రియేలు వ్యవహరించనున్నారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ దయాకర్ రాజు పేతురు, సురేష్, రవి నాయక్ సంపోను పుష్పమ్మ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. మండలంలోని పాస్టర్లందరినీ ఐక్యంగా ముందుకు నడిపిస్తూ, సువార్త పరిచర్యను విస్తరించడంతో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధికి, సమాజ సేవకు నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సహకరించిన మండల పాస్టర్లందరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

లక్ష్యం 25 వేలు, గెలుపు దిశగా అడుగులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, పట్టభద్రుల ఓటరు నమోదు హెల్ప్ డెస్క్ ను, ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్,మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డిని గెలిపించేందుకు,పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.25 వేల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలనే లక్ష్యంతో, ప్రతి కార్యకర్త, సోషల్ మీడియా వారియర్స్, కోఆర్డినేటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు,జిల్లా నాయకులు,పట్టణ నాయకులు,కాంగ్రెస్ కార్యకర్తలు, పట్టభద్రుల నమోదుదారులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి,భైంసా:కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం బహుజన సంక్షేమ పోరాట వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకలలో జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు.ముందుగా అధికారులు, ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల అణిచివేతపై ఆనాటి కాలంలో దొరలు,భూస్వాములు,నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న గొప్ప పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయనను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తొలిసారిగా పండుగ సాయన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు.ఈ జయంతి వేడుకలలో బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, కార్మిక శాఖ అధికారి రాజలింగం, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,ముదిరాజ్ కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తున్న జిల్లా మంత్రులు


*** మచ్చ వెంకటేశ్వర్లు**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించడంలో జిల్లా రైతాంగానికి జిల్లా మంత్రులు తీరని అన్యాయం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు,గురువారం మంచికంటి భవన్ లో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉన్నాయని , గోదావరి నీటిని ఒడిసి పట్టడం ఎవరికోసమని ఆయన ప్రశ్నించారు. జిల్లా రైతాంగానికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. జిల్లాలో ఇల్లందు ,పినపాక, కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాలకు చుక్క నీరు రావడం లేదన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు,రోల్లపాడు ప్రాజెక్టుల ఊసే ఎత్తని మంత్రి లంకాసాగర్ కు నీళ్ళు తీసుకొని పోవడానికి ప్రణాళికలు రూపొందించడాన్ని తీవ్రంగా విమర్శించారు. జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాలకు సాగునీటి సాధనకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువులకు అనుసంధానం కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలోఎజె రమేష్, అన్నవరపు సత్యనారాయణ, కొలగాని బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పండుగ సాయన్న అందరికీ స్ఫూర్తిదాయకం

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గురువారం మెదక్ కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ లో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు.ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డి పి ఆర్ వో రామచంద్ర రాజు, క్యాంప్ ఆఫీస్ కార్యాలయ సిబ్బందికి తదితరులు పాల్గొన్నారు.కలెక్టరేట్లో డి ఆర్ వో అంబదాస్ రాజేశ్వర్ రాజేశ్వర్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ ముది రాజ్ సంఘం నాయకులు, యువజన సంఘాలు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఘనంగా పండగ సాయన్న 174వ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్:బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు పండగ సాయన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంలో పండగ సాయన్న 174వ జయంతి వేడుకలను పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ఉన్న పండగ సాయన్న విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొని పండగ సాయన్న సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ మోహన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందె బాబయ్య, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మంగ వెంకటేష్, ఆంజనేయులు, యువసత్తా లక్ష్మన్, శ్రీధర్ వర్మ, మాజీ కౌన్సిలర్లు కానుగ అంతయ్య, నందకిశోర్, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన వీరుడు కొమరం భీమ్‌కు ఘన నివాళులు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :కొత్తగూడెం పట్టణంలోని కొమరం భీమ్ సర్కిల్ ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద తెలంగాణ గడ్డపై ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం అలుపెరగని పోరాటం సాగించిన మహనీయుడు కొమరం భీమ్ విగ్రహానికి ఆధార్ సొసైటీ రాష్ట్ర నాయకులు పోడియం బాలరాజు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన త్యాగాలను స్మరించుకుంటూ జల్-జంగల్-జమీన్ అనే నినాదంతో గిరిజనుల హక్కుల కోసం పోరాడిన కొమరం భీమ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని , ఆదివాసీల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని ఆయన సేవలను కొనియాడుతూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ గిరిజనుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ డబ్ల్యూ సి ఏ జిల్లా అధ్యక్షులు తోలెo వెంకటేశ్వర్లు , ఉపాధ్యక్షులు మలకం సాములు , ఫైనాన్స్ సెక్రటరీ పెండేకట్ల . రామనాథం , మహిళా కార్యదర్శి అమృత ,సిఆర్టిటిడబ్ల్యూ నాయకులు తాటి అశోక్ , యువజన నాయకులు ఈసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలి

షాద్‌నగర్ సీనియర్ నాయకులు తాండ్ర కాశీనాథ్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు తాండ్ర కాశీనాథ్ రెడ్డి ఆయన స్వగృహంలో ప్రత్యేకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలవాలని కాశీనాథ్ రెడ్డి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా వైద్యం, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని కోరారు. రైతులకు సాగునీరు, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సదుపాయాలు మెరుగుపడటంతో పాటు పేదలకు గృహ వసతి, అర్హులైన వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలని పేర్కొన్నారు. రహదారులు, రవాణా సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక ప్రగతి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. దుర్గమ్మ అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్రంపై ఎల్లప్పుడూ ఉండి, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఈ సందర్భంగా తాండ్ర కాశీనాథ్ రెడ్డి ప్రార్థించారు.

పంచశీల కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా కాపా సుబ్బారెడ్డి, సతీష్ బీరిదార్



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి:రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా కాపా సుబ్బారెడ్డి ,ప్రధాన కార్యదర్శి గా సతీష్ బీరిదార్ ఎన్నికయ్యారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా గురువారం అధ్యక్షులు కాపా సుబ్బారెడ్డి ,ప్రధాన కార్యదర్శి గా సతీష్ బీరిదార్ నామినేషన్ దాఖలు చేశారు. ఎలక్షన్ లో వేరే నామినేషన్ దాఖలు చేయనందున స్టీరింగ్ కమిటీ సభ్యులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. పంచశీల కాలనీ హాట్రిక్ అధ్యక్షులుగా కాపా సుబ్బారెడ్డి ,ప్రధాన కార్యదర్శి గా సతీష్ బీరిదార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన నివాసంలో కాలనీ సభ్యులు , అభిమానులు అందరూ కలిసి వారిని శాల్వాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పేదల పక్షాన పోరాడిన పండుగ సాయన్న జీవితం ఆదర్శప్రాయం

*** అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న ముదిరాజ్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న దోపిడీని, భూస్వాముల ఆధిపత్యాన్ని ఎదిరించి పేదల పక్షాన నిలిచిన పోరాట యోధుడు పండుగ సాయన్న అని కొనియాడారు. పేదల ఆకలి తీర్చడం, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.పండుగ సాయన్న ఆశయాలను, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, సమానత్వం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి చిర్రా రఘు, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల సుభాష్, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు జోరుక సదయ్య, శ్రీనివాస్, సుధాకర్, రవీందర్, గోపాల్, శ్రీధర్, మల్లయ్య, మద్దెల విజయ, భీమానదుని సత్యనారాయణ, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఖేత్ బచావో అభియాన్' పై అవగాహన కార్యక్రమం



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం పై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారిని రామడుగు వాణి అన్నారు. కూసుమంచి రైతు వేదికలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల మార్పిడి ప్రాధాన్యత, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వినియోగం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. యాసంగి పంట కాలంలో వరి, మొక్కజొన్న పంటల సాగును తగ్గించి, తక్కువ కాలపరిమితి కలిగిన పప్పుధాన్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. తద్వారా పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కనకం మైసయ్య కుటుంబానికి కందాల పరామర్శ



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఇటీవల మరణించిన కూసుమంచి మండల కేంద్ర నివాసి కనకం మైసయ్య కుటుంబాన్ని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కూసుమంచి మండల కేంద్రంలోని మైసయ్య నివాసగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమయంలోనే మనోధైర్యంతో ఉండాలని సూచించారు. మైసయ్య నిరాడంబరతను ఈ సందర్భంగా కందాల కొనియాడారు. మైసయ్య మంచితనాన్ని గుర్తు చేసుకున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాదులో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మైసయ్య ను గతంలో కందాల పరామర్శించింది గుర్తుకు తెచ్చుకున్నారు. ఇంతలోనే ఇలా అకాల మరణం పొందటం బాధాకరమని అన్నారు మైసయ్య కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా మైసయ్య భార్య ఉమాను ఓదార్చి మైసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ నూతన ఇంటిని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి,ఖైంసా:నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని దొడర్నా పాట ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంకు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మాజీ శాసనసభ్యులు గడ్డిగారి విఠల్ రెడ్డి,ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోనెల కళ్యాణ్,వైస్ చైర్మన్ షైక్ అహ్మద్, ఉప సర్పంచ్ మాజీ జడ్పీటీసీ శంకర్ చౌహన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ రెడ్డి దొడర్న సర్పంచ్ బిక్కు,కుబీర్ సర్పంచ్ సాయినాథ్,మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ దిగంబర్ పటేల్,మాజీ సర్పంచ్ విజయ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ సూదిరాజన్న, మల్లేష్ యాదవ్,డాక్టర్ పెంటజీ,మాజీ సర్పంచ్ దత్తు గౌడ్,సాహెబ్ రావు పటేల్,బక్కన్న,మైనారిటీ నాయకులు రావుఫ్,అల్కె దత్తు,సాయినాథ్ తదితరులు ఉన్నారు.

ఎండిన పంటలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు

*** ముఖ్యమంత్రితో సహా మంత్రులంతా క్షేత్రస్థాయిలో పర్యటించాలి:**

*** సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు**



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ:ఎలినోవా ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. గురువారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం చెర్లపల్లి గ్రామంలో ఎలినోవా ప్రభావంతో ఎండిపోయిన పంట పొలాలను సీపీఐ(ఎం) రాష్ట్ర,జిల్లా నాయకత్వం, రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం బి.వి. రాఘవులు మాట్లాడుతూ చెర్లపల్లి గ్రామంలో ప్రధానంగా వరి, పత్తి పంటలు సాగు చేశారు. వరి పంట పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. కొన్ని చోట్ల పంట పూర్తిగా ఎండిపోయాయని, తాలు తప్ప గింజ కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. మరో తడుపు నీరు అందితే పంట చేతికొచ్చేది. మొత్తం పెట్టుబడి పెట్టి పంట దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు చివరికి ఒక్క పైసా కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్న, సన్నకారు రైతులు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోతే వారి జీవితాలు ఎంత హృదయవిదారకంగా ఉంటాయో ఇక్కడి రైతుల పరిస్థితిని చూస్తే అర్థమవుతోంది" అని అన్నారు.

*** పత్తి పంట పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది**

"పత్తి చేలు పైకి పచ్చగా కనిపిస్తున్నప్పటికీ ఆకులన్నీ వాడిపోయాయని, మరో వారం రోజులు వర్షం లేకపోతే పత్తి పంట కూడా పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే వర్షాభావం వల్ల పంట పెరుగుదల లేదు. కాపు కాసిన కాయలు కూడా ఎండిపోయి రాలిపోతున్నాయన్నారు. భవిష్యత్తులో మళ్లీ వర్షాలు పడతాయనే గ్యారెంటీ కూడా లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ప్రభుత్వం ఏవిధంగా ఆదుకుంటుందో తక్షణమే ప్రకటించాలి" అని రాఘవులు డిమాండ్ చేశారు.

*** కేబినెట్‌లో కూర్చుంటే రైతుల కష్టాలు అర్థం కావు**

"రాష్ట్రంలో ఎలినోవా ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై చర్చించేందుకు రేపు కేబినెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. కేబినెట్‌లో కూర్చొని చర్చిస్తే రైతుల వాస్తవ పరిస్థితులు పూర్తిగా అర్థం కావని, మంత్రులందరూ జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలన్నారు. మంత్రులు నేరుగా పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలిస్తేనే రైతులు ఎదుర్కొంటున్న హృదయవిదారక పరిస్థితులు అర్థమవుతాయి. రైతులను ఎలా ఆదుకోవాలనే దానిపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి" అని అన్నారు.

*** రైతుల కష్టాలపైనా దృష్టి పెట్టాలి**

"రాబోయే రోజుల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలుస్తోంది. తాగునీటి సమస్యపై ప్రభుత్వం ఆలోచించడం అవసరమేనని, భవిష్యత్తులో నీటి కొరత తీవ్రంగా ఉండే ప్రమాదం ఉందన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులను తక్షణమే ఆదుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు.

*** కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి**

"కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.20 వేల కోట్ల నుంచి రూ.30వేలకోట్ల వరకు నిధులు కోరినట్లు చెబుతున్నారు. అయితే ఈ మొత్తం ఎంతవరకు సరిపోతుందో కూడా ఆలోచించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందో లేదో స్పష్టత లేదని, అన్ని రాజకీయ పార్టీలు కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తేనే రాష్ట్రానికి నిధులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రితో సహా మంత్రులందరూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలన్నారు.రేపటి కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అన్ని పార్టీలను కలుపుకొని అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ఈ సమస్యపై తీవ్రంగా ఆలోచించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతో పాటు రైతు సంఘాలతో కూడా చర్చించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు.ఈ పర్యటనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, తీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరపల్లి వెంకటేశ్వర్లు,పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, దండంపెల్లి సత్తయ్య, కొండ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో కొమురం భీమ్ విగ్రహాల వద్ద తాగుబోతుల అల్లరి

*** ఆదివాసి నాయకుల తీవ్ర ఆవేదన!**



ప్రజాస్ఫూర్తి,ఖైంసా :కొమరం భీమ్ 125వ జయంతిని పురస్కరించుకొని గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం మొదట , ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా ఉన్న కొమరం భీమ్ విగ్రహాలకు ఆదివాసి నాయక పోడు సేవా సంఘం, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్ మాట్లాడుతూ... కొమరం భీమ్ జయంతి మరియు వర్ధంతి రోజులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి సాధారణ సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాల పరిసర ప్రాంతాల్లో కనీసం మొక్కలకు నీళ్లు పోసే పరిస్థితి కూడా లేదని, ఈ ప్రాంతాలను వైన్స్, తాగుబోతులకు అడ్డగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తాగిన సీసాలను అక్కడే పడేస్తూ విగ్రహ పరిసరాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా నిర్మల్ జిల్లా మున్సిపల్ అధికారులు స్పందించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసులు 5వ షెడ్యూల్డ్ ఏరియా హక్కుల అమలు కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మైదాన ప్రాంతంలో ఆదివాసి తెగలకు సరైన గుర్తింపు ఇవ్వకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిర్మల్ జిల్లాలో వలసవాదులకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వడాన్ని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. నిజాం నవాబుల పాలనకు వ్యతిరేకంగా 'జల్, జంగిల్, జమీన్' నినాదంతో భూమి, అడవి, నీరుపై ఆదివాసులకు హక్కులు కావాలని పోరాడిన మహానీయుడు కొమరం భీమ్ అని కొనియాడారు. నిర్మల్ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి ఆదివాసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు రక్షణ కల్పించి, వెంటనే హక్కు పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయక పోడు ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి శివ శంకర్, నాయక పోడు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సవీన్, రమేష్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి గోవర్ధన్, జిల్లా బీజేపీ నాయకులు నర్సారెడ్డి, నైతం భీమ్ రావు, సూర్య భాను, ఉయిక భీమ్రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎల్-నినోను ఎదుర్కోవాలంటే పంటల మార్పు తప్పనిసరి

*** షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి**

ప్రజాస్ఫూర్తి, షాద్నగర్:ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యతలో మార్పులు, వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు పంటల ప్రణాళికతో సాగు చేపట్టాలని షాద్‌నగర్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) రమాదేవి సూచించారు. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించేందుకు యాసంగిలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె కోరారు.ఫరూక్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో గురువారం వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు రైతు పెంబళ్ల శ్రీధర్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సాగు పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పంటల సాగు విధానాలను పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు.రైతు శ్రీధర్ తనకున్న నాలుగున్నర ఎకరాల భూమిలో ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సూచనల మేరకు వరి సాగుకు బదులుగా రెండున్నర ఎకరాల్లో తుంపర సేద్యం పద్ధతిలో బెండకాయ, టమాట పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన రెండు ఎకరాల్లోనూ తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటలు సాగు చేసేందుకు భూమిని సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పు దిశగా రైతు తీసుకున్న నిర్ణయాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమాదేవి మాట్లాడుతూ రబీ జొన్న, కుసుమ, పెసర, మినుములు, సజ్జలు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. పంటకు అవసరమైన నీటిని మాత్రమే అందించే బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి విధానాలను అవలంబించాలని, ఉద్యానవన శాఖ ద్వారా అర్హత మేరకు సబ్సిడీపై లభించే బిందు సేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటల మార్పుతో పాటు నేలలో తేమను సంరక్షించే పద్ధతులు పాటించడం, నీటిని వృథా కాకుండా వినియోగించడం, సాగు ఖర్చులను నియంత్రించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రమాదేవి తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుంటూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ఉద్యానవన అధికారి హిమబిందు, కాటన్ సీపీఓ తిరుమలరావు, ఏఎంసీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీశైలం, ఏఈఓ రాంబాబు, హెచ్ఈఓ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ డిపోలో నేడు 'డయల్ యువర్ డీఎం



మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి): మేడ్చల్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పరిమళ తెలిపారు. ప్రయాణికులు బస్సు సౌకర్యాలు, రాకపోకల సమస్యలు, ఇతర ఫిర్యాదులను 9959226152 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

15వ వార్డులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం-వరంగల్- నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత... ఈ సందర్భంగా పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పట్టభద్రులంతా ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వార్డు కౌన్సిలర్లు నాగుల వాసు, పాలగాని కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సైదిరెడ్డి, ధర్మా నాయక్, వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, అరవింద రెడ్డి ,బూక్య మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరీక్షల్లో పాల్గొన్న అధికారులు

*** సదరం వెరిఫికేషన్‌కు సహకరించని పెన్షన్‌దారులు**

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో సదరం సర్టిఫికెట్ల పంపిణీ లో అవినీతి జరిగిందని పిర్యాదులు అందడంతో అధికారులు గురువారం సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియకు కొందరు పెన్షన్‌దారులు సహకరించకపోవడంతో పాటు ఆయా పెన్షన్ దారులను ఫోన్ లో సంప్రదించగా తాము ఇక్కడ లేమని కొందరు , పనికి వెళ్ళామని మరికొందరు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దీంతో వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయలేక అధికారులు శనివారానికి వాయిదా వేసినట్లు సమాచారం. దీంతో పెండింగ్‌లో ఉన్న పరిశీలనను శనివారం పూర్తి చేసేందుకు అధికారులు వాయిదా వేశారని సమాచారం.శనివారం జరిగే వెరిఫికేషన్‌లోనైనా పెన్షన్‌దారులు పూర్తిస్థాయిలో సహకరిస్తారా? ప్రక్రియను అధికారులు ఎలా పూర్తి చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యం

: కలెక్టర్ కె. హరిత



ఆసిఫాబాద్ , ప్రజా స్ఫూర్తి: జిల్లాలోని ఆకాంక్షిత మండలమైన తిర్యాణిలో మారుమూల గ్రామాల సమగ్ర అభివృద్ధికి హోలిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, పోషకాహారం, ఉపాధి, రహదారులు తదితర రంగాల్లో గ్రామాల అవసరాలను గుర్తించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో గురువారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆర్థిక సహకారంతో సీవైడీఓ సంస్థ అమలు చేయనున్న హోలిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సంబంధిత సంస్థల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, ప్రాథమిక మౌలిక వసతులు కల్పించడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడటం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉండాలన్నారు.

రీ సర్వే ప్రక్రియ పరిశీలన

అనంతరం దుగ్గాపూర్ శివారులో భూముల రీ సర్వేలో భాగంగా చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. దుగ్గాపూర్, గోయగాం గ్రామాల మధ్య వర్షాకాలంలో దెబ్బతిన్న లోలెవల్ వంతెనను పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నగేష్, హెచ్‌డీఎఫ్‌సీ రీజినల్ హెడ్ వెంకటేష్ చల్లా, జోనల్ హెడ్ జోష్ స్టీఫెన్, సీవైడీఓ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర్ రావు, సంబంధిత అధికారులు, సర్పంచులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పాత కక్షలతో యువకుడి హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

*** శిక్ష పడేలా కృషి చేసిన వారిని అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో యువకుడి హత్యకు సంబంధించిన కేసులో ఏడుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెల్లడించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించి, న్యాయస్థానంలో నేరం నిరూపితమయ్యేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన జెల్లా రాజారామ్ గౌడ్, యాదరం నాగరాజు గౌడ్ కుటుంబాల మధ్య గత కొంతకాలంగా పాత కక్షల నేపథ్యంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య పలుమార్లు ఘర్షణలు చోటుచేసుకోవడంతో నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.ఈ నేపథ్యంలో 20052020న ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో జెల్లా రాజారామ్ గౌడ్ కుమారుడు జెల్లా నర్సింలు గౌడ్ (28) గ్రామ శివారులోని బీడు భూమిలో తీవ్ర రక్తగాయాలతో పడి ఉండటాన్ని రాజారామ్ గౌడ్ గమనించారు. తన కుమారుడిని కాపాడాలంటూ ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. తనపై పాత కక్షలతో కొందరు వ్యక్తులు రాళ్లు, కట్టెలు, పదునైన ఆయుధాలతో దాడి చేసినట్లు నర్సింలు గౌడ్ తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన నర్సింలు గౌడ్‌ను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నిజాంపేట ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేయగా, అప్పటి దర్యాప్తు అధికారి రామాయంపేట సీఐ నాగార్జున గౌడ్ సమగ్రంగా దర్యాప్తు చేసి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు.స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత దర్యాప్తు అధికారి సైదా, నిజాంపేట ఎస్ఐ సహకారంతో సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు.పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ఏడుగురు యాదరం నాగరాజు గౌడ్, బంధారం లక్ష్మీనారాయణ గౌడ్, బంధారం నాగరాజు గౌడ్, బంధారం నవీన్ గౌడ్, బంధారం గణేష్ గౌడ్, యాదరం శేఖర్ గౌడ్, యాదరం రమేష్ గౌడ్ నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, కోర్టు లైజన్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్, నిజాంపేట సీడీఓ మహేష్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

వ్యాపారం లో రాణించాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: నిమ్మికల్ కేంద్రంలో బిజెపి జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్ పగిళ్ళ గన్నారెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన (హెచ్. పి)పెట్రోలియం బంకును ఈరోజు మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు మరియు ఎస్ కె ఆర్ కన్ స్ట్రక్షన్స్ అధినేత సంకినేని కృష్ణారావు సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన ఇంధనాన్ని అందిస్తూ, వ్యాపార రంగంలో గన్నారెడ్డి మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ఈ బంక్ నిరంతరం ప్రజాసేవలో విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లకు టీఆర్‌పీ మద్దతు

భూపాలపల్లి (ప్రజా స్ఫూర్తి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలందించిన ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఏటా ఐదు శాతం ఇంక్రిమెంట్‌తోపాటు ఎనిమిది శాతం హెల్త్ బోనస్ ఇవ్వాలని, 180 రోజుల ప్రసూతి సెలవులు, ఈహెచ్ఎస్/ఈఎస్ఐ వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు, పీఆర్సీ, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని, ఉద్యోగ సంఘాల నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని రవి పటేల్ విజ్ఞప్తి చేశారు.ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందాలంటే ముందుగా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల హక్కుల సాధనకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంబాల నరసయ్య, గట్టు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంకేఎస్‌వై 2.0 పనుల్లో అవినీతి ఆరోపణలు

*** ఇద్దరు అధికారులు ఏసీబీ కస్టడీలోకి**

*** రూ.1.62 కోట్ల పనులకు సంబంధించి రూ.39.14 లక్షల బదిలీ.. బిల్లుల చెల్లింపుల్లో పర్సంటేజీల డిమాండ్‌పై దర్యాప్తు**



భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి): ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) 2.0 పథకం పనుల్లో అవినీతి ఆరోపణలు కలకలం రేపాయి. కాంట్రాక్టర్ నుంచి బిల్లుల చెల్లింపులకు సంబంధించి పర్సంటేజీల పేరుతో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో భూపాలపల్లిలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో రికార్డులు, సంబంధిత అధికారుల ఫోన్లలోని సమాచారాన్ని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో లభించిన ఆధారాల మేరకు ప్రాజెక్టు అధికారి సతీష్‌రెడ్డి, టెక్నికల్ అధికారి రాజును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

*** రూ.1.62 కోట్ల పనులు.. రూ.39.14 లక్షల బదిలీలు**

పీఎంకేఎస్‌వై 2.0 పథకం కింద భూగర్భ జలాల పెంపు, సేద్యపు గుంతలు, ఊట గుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ, మల్హర్‌రావు, పలిమెల మండలాలను ఈ పథకం అమలుకు ఎంపిక చేశారు.రేగొండ మండలంలోని బాగిర్తిపేట, గూడేపల్లి, మడతపల్లి, నారాయణపూర్, దుంపిల్లపల్లి, పొనగండ్ల గ్రామాల్లో పనులు నిర్వహించారు. ఈ పనులను మొత్తం నలుగురు కాంట్రాక్టర్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.వారిలో ఒక కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో రికార్డులను పరిశీలించడంతోపాటు సంబంధిత అధికారుల ఫోన్లలోని సమాచారాన్ని విశ్లేషించారు. బిల్లులు మంజూరైన ప్రతిసారీ డబ్బులు బదిలీ చేయాలని సందేశాలు పంపడం, బ్యాంకు ఖాతాల వివరాలను పంపినట్లు గుర్తించామని వెల్లడించారు. కాంట్రాక్టర్ సుమారు రూ.1.62 కోట్ల విలువైన పనులు చేయగా, వాటికి సంబంధించి రూ.39.14 లక్షలు వివిధ ఖాతాలకు బదిలీ అయినట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ లావాదేవీలకు సంబంధించిన వివరాలను ఏసీబీ అధికారులు సేకరించారు.

*** ఉన్నతాధికారుల పాత్రపైనా విచారణ జరగాలి**

ఈ వ్యవహారంలో కింది స్థాయి అధికారుల పాత్రతోపాటు ఉన్నతాధికారుల ప్రమేయం ఏమైనా ఉందా అనే అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ కోణంలోనూ విచారణ జరుపుతారా అనే ప్రశ్నకు ఏసీబీ అధికారులు స్పందిస్తూ, అందిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టామని, అన్ని కోణాల్లోనూ విచారణ కొనసాగిస్తామని స్పష్టం చేసినట్లు తెలిసింది.అదుపులోకి తీసుకున్న ఇద్దరు అధికారులను మరుసటి రోజు వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఉద్యోగి అయినా పని చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎల్ నినో ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి,ప్రజాస్ఫూర్తి: యాదగిరిగుట్ట మండలం మహబూబ్ పేట గ్రామంలో ప్రారంభించిన ఎల్.నీ.నో ప్రత్యేక గ్రామ సభ జరుగుతుండగా అదనపు కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, గ్రామసభ యొక్క ముఖ్య ఉద్దేశాలను అనగా రెండవ పంట వేసుకోవద్దని, బిబిజి రాంజీ పథకంలో భాగంగా ప్రతి వెజ్ సీకర్ కి 125 పని దినాలు కల్పించబడుచున్నదని, కల్పించబడిన 175 పనుల నుండి మహబూబ్ పేట గ్రామానికి సంబంధించిన పనులు ఎంచుకొని అత్యధికంగా వేజ్ పనులు చేసినట్లయితే దానికి అనుగుణంగా 40% మెటీరియల్ కాంపోనెంట్ పనులు మన గ్రామంలో చేసుకోవచ్చని ప్రజలకు వివరించారు. ఇట్టి కార్యక్రమానికి సునీల్ కుమార్ మండల ప్రత్యేక అధికారి, నవీన్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గణేష్ నాయక్, మండల తాసిల్దార్, శ్రీనివాసరెడ్డి, మండల పంచాయత్ అధికారి (ఇన్చార్జ్), జె ప్రజ్ఞ, ఏఈ మిషన్ భగీరథ, జయ ఏఈఈ ఇరిగేషన్, నరసయ్య ఏపీఓ, వెంకటేశ్వర్లు ఏపీఎం , పంచాయతీ కార్యదర్శి ,రమేష్ , గ్రామ సర్పంచ్ రమేష్ ,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ప్రజలు హాజరైనారు.

వ్యక్తిత్వ నిర్మాణానికి వేదిక నవరాత్రి దీక్షలు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : భక్తి మార్గంలో అడుగులు వేస్తూ , క్రమశిక్షణ , సంస్కారాన్ని జీవితంలో భాగం చేసుకుంటూ యువత ఆదర్శంగా నిలుస్తుంది . దేవి శరన్నవరాత్రుల సందర్భంగా చుంచుపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటుచేసిన దుర్గ మాత మండపాలలో పలువురు యువతి , యువకులు భవాని మాల ధారణ వేసి దీక్షలు చేపట్టారు . తొమ్మిది రోజులు పాటు అమ్మవారిని నియమనిష్ఠలతో ఆరాధిస్తూ ఆధ్యాత్మిక వాతావరణం లో గడుపుతూ చెడు వ్యసనాలకు స్వస్తి పలుకుతున్నారు . కోపాన్ని అదుపులో ఉంచుకోవడం, మాటలను నియంత్రించుకొని ఎదుటి వారితో మర్యాదగా పలకరించటం , పెద్దలను గౌరవించడం, సెల్ ఫోన్లకు దూరంగా ఉండటం తదితర మంచి లక్షణాలను అలవర్చుకుంటున్నారు .నిత్య పూజలు, నియమాలు పాటించడంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు . భవాని దీక్షలు ఆధ్యాత్మిక సాధనకే పరిమితం కాకుండా మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవటానికి ఉపయోగపడుతుందని యువ భక్తులు చెప్తున్నారు.

తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: బొమ్మల రామారం మండలం సోలిపేట గ్రామంలోని విజయలక్ష్మి అనే రైతు క్షేత్రంలో నిర్వహించిన మునగ సాగు మొక్కలు నాటే కార్యక్రమంలో గురువారం జిల్లా కలెక్టర్ పాల్గొని మొక్క నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్... ఉద్యాన శాఖ నుండి డ్రిప్పు పరికరాలు మూడు ఎకరాలకు రాయితీపై మరియు మునగ మొక్కలు సిఓఈ జేడిమెట్ల ఉద్యాన శాఖ నుండి అందజేశారు. మునగ సాగు విధానం, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రాధాన్యతకు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం మునగ మొక్కను నాటారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి భూగర్భ జలమట్టాలు తక్కువగా ఉన్నందున భవిష్యత్తులో నీటి కొరత అయ్యే పరిస్థితులను ముందుగానే దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.నీటి లభ్యత తగ్గిన సందర్భాల్లో పంటలకు తగినంత నీరు అందక దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని సూచించారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. మునగ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా నీటి కొరత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి హేమలత , జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి , జిల్లా విద్యా శాఖ అధికారి బిక్షపతి,ఉద్యాన అధికారి కవిత,సోలిపేట గ్రామ సర్పంచ్ పావని ఇంద్రసేనారెడ్డి, ఎమ్మార్వో బొమ్మలరామారం, ఎంపీడీవో, ఉపాధి హామీ సిబ్బంది , మొరింగా మిషన్ సిబ్బంది, దీశాలి ఎఫ్ పి ఓ సభ్యులు , గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్పీ ఇందిరమ్మ వరద కాలువ పనులకు రూ.251.951 కోట్ల మంజూరిపై సంబరాలు


*** సిసి లైనింగ్ పనుల టెండర్లకు అనుమతి లభించడంపై హర్షా తిరేకాలు**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి :హుస్నాబాద్ నియోజకవర్గ రైతాంగానికి దసరా కానుకగా ఎస్ఆర్ఎస్పీ ఇందిరమ్మ వరద కాలువ పనుల కోసం రూ.251.951కోట్లు మంజూరు కావడం పట్ల రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో ఈ నిధులు విడుదల కావడం పట్ల గురువారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని బాణసంచా కాల్చి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డిలు మాట్లాడుతూ ఇందిరమ్మ వరద కాలువ ప్యాకేజీ3 పనుల కోసం రూ.211.172కోట్లతో పరిపాలనా ఆమోదం లభించిందని తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో ప్రధాన కాలువల్లో సిసి లైనింగ్,అదనపు నిర్మాణాల పనుల కోసం మరో రూ.40.771కోట్లతో టెండర్లకు అనుమతి రావడం హుస్నాబాద్ నియోజకవర్గ వ్యవసాయ రంగానికి ఒక కీలక ముందడుగు అని కొనియాడారు.ఈ నిధుల మంజూరుతో కాలువ చివరి ఆయకట్టు రైతులకు కూడా సకాలంలో సాగునీరు అందుతుందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ విజయవంతమైన సంబరాల కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మర్మా రాజ్ కుమార్ గౌడ్,డీసీసీ కార్యదర్శులు బడుకొలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు,సర్పంచ్ లు ఆకవరం భవాని శివప్రసాద్,అలువాల శంకర్, గూళ్ల రజిత రాజు,గోగురి లక్ష్మీ మురారి రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు పోటు మల్లారెడ్డి, శ్రీరామోజు రాజకుమార్,ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,నాయకులు పూల లచ్చిరెడ్డి,సిరవేణి సంపత్,కాత తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వేణుకు

*** కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం**



చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:జాతీయ స్థాయిలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో రాణిస్తున్న చిగురుమామిడి గ్రామానికి చెందిన విద్యార్థి జిల్లెల్ల వేణు (14) ను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన 45వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వేణు తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రతిభ చాటాడు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్ క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు.భవిష్యత్తులో వేణు అంతర్జాతీయ స్థాయిలో రాణించి హుస్నాబాద్ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,సింగిల్ విండో ఛైర్మన్ చిట్టుమల్ల రవీందర్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మర్క రాజ్ కుమార్ గౌడ్,డీసీసీ కార్యదర్శులు బడుకొలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు, సర్పంచ్ లు ఆకవరం భవాని శివప్రసాద్,అలువాల శంకర్, సింగిల్ విండో డైరెక్టర్ పోటు మల్లారెడ్డి,నాయకులు సిరవేణి సంపత్,తేలు వెంకన్న,పీచు మల్లారెడ్డి,సోషల్ మీడియా కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్, వివిధ గ్రామాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకం కాకపోతే.. విపత్తులు తప్పవు

: వెంకయ్య నాయుడు

హైదరాబాద్:భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు.ప్రకృతితో మమేకమై జీవనం సాగించకపోతే.. విపత్తులు తప్పవని హితవు పలికారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నేతలు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు సహా పలువురు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ సహా పలు పార్టీల నేతలు సైతం తరలివచ్చారు. మనుషుల మధ్య ఐక్యతను పెంపొందించే కార్యక్రమమే అలయ్ బలయ్ అని ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు చెప్పారు.

ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

భువనగిరి ప్రజాస్ఫూర్తి : బొమ్మలరామారం మండలం సోలిపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్ర భవనాలను గురువారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రం భవనాని పరిశీలించి విద్యార్థులు, చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, గ్రామంలో మొత్తం ఎంతమంది పాఠశాల వయస్సు పిల్లలు ఉన్నారు, వారిలో ఎంతమంది



ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించి, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం రామునితండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు వంట తయారీ, ఆహార పంపిణీకి అనుకూలంగా ఉండేలా కిచెన్ షెడ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు..బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామంలోని కేజీబీవీ పాఠశాల, జూనియర్ కళాశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఈ విద్యా సంవత్సరం నుంచి జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి బిక్షపతి, ఎంపిడిఓ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో ఘనంగా
పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు

చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు,పేద ప్రజల ఆరాధ్య నాయకుడు పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను చిగురుమామిడి ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పెసరి రాజేశం ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం,అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,సర్పంచ్ లు ఆకవరం భవాని శివప్రసాద్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్,సర్పంచ్ లు గుళ్ల రజిత రాజు,సన్నీల్ల కవిత వెంకటేష్,అలువాల శంకర్,అల్లెపు సంపత్, కాంగ్రెస్




పార్టీ జిల్లా కార్యదర్శులు బడుకోలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు, సింగిల్ విండో డైరెక్టర్ పోటు మల్లారెడ్డి,గుళ్ల కొమురయ్య,మాజీఎంపీటీసీ మెడ బోయిన తిరుపతి,మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు చెరుకు సంజీవ్,గట్టు శ్రీనివాస్,జక్కుల బాబు,గందె సంతోష్,గూళ్ల బాలయ్య, మామిడి సంపత్, ఏండ్రా నారాయణ,రెడ్డి మల్లయ్య, చిగురు మామిడి కుల పెద్దమనిషి చెరుకు చిన్నసమయ్య,ఉపాధ్యక్షులు పొగాకుల రమేష్,కార్యదర్శి గూడ సతీష్, నవాబుపేట కులం పెద్దమనిషి గుళ్ళ కనకయ్య,పెసరి మల్లయ్య, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ జిల్లేల రమేష్, ఉప సర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గట్టు ప్రశాంత్,పూల లచ్చిరెడ్డి,కవ్వంపల్లి సంజీవ్, కాత తిరుపతి,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కనకయ్య,ఎనగందుల లక్ష్మణ్, కానవేణి శివకుమార్, తేలు వెంకన్న, వంటకాల సంపత్ రెడ్డి,పీచు మల్లారెడ్డి, నాయకులు సిరవేణి సంపత్, దెంచనోజు చంద్రశేఖర్, తిరుపతి రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు బరిగెల సదానందం, చెరుకు రాజయ్య,మల్లం సతీష్,మల్లం అనంతరాములు, బాలయ్య కుమారస్వామి, సదానందం, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పండుగ సాయన్న సమాజంలోని పేదలు, బలహీన వర్గాల ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.అదేవిధంగా బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాటపాడే లాలీపాప్!



'బాబూ ఇళయరాజా పాటపాడే ఒక లాలీపాప్ ఇవ్వు'... అని ఒక పెద్దాయన అంటే, 'అన్నా ఒక కె- పాప్ ట్రాక్ లాలీపాప్ ఇవ్వు' అన్నాడు మరో టీనేజీ కుర్రాడు... వినేవాళ్లకు ఇదంతా అయోమయంగానూ, ఆశ్చర్యంగానూ ఉంటుంది. అదీ నిజమే కదా... మ్యూజిక్ ట్రాక్స్‌కీ, తినే లాలీపాప్స్‌కీ ఏంటి సంబంధం అనిపిస్తుంది కానీ, మీరు వింటున్నది 100 శాతం నిజమే... ఇవి ఆడియో లాలీపాప్స్. మన చెవులకు మాత్రమే వీనుల విందైన సంగీతం అందిస్తాయివి. కావాలంటే మీరూ ఓ లాలీపాప్ తిని చూడండి...

చెవుల్లో తీగలున్న ఇయర్‌ఫోన్సో, తీగలు లేని ఇయర్‌బడ్సో లేకుండా దాదాపు యువత కనిపించదు. కానీ అవేమీ లేకుండా కూడా సంగీతాన్ని వినే అవకాశం కల్పిస్తున్నాయి ఆడియో లాలీపాప్స్. ఇయర్ ఫోన్లూ, మరే ఇతర స్పీకర్లూ లేకుండానే, కేవలం ఒక లాలీపాప్‌ని తింటూ, అద్భుతమైన సంగీతాన్నీ ఆస్వాదించవచ్చు. ఈ సంగీతం మనకు తప్ప వినాలనుకున్నా మరెవరికీ వినిపించదు. అవును, ఒక పక్క తియ్యని రుచి నోటికీ, మనసుకీ ఆనందం కలిగిస్తుంటే మరోపక్క మీకిష్టమైన సంగీతం ఆ ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే సంగీత ప్రియులు పెద్దగా డబ్బులు ఖర్చుపెట్టకుండానే మినీ కాన్సర్ట్‌ని సోలోగా ఎంజాయ్ చేయొచ్చు... అది కూడా మీకు నచ్చిన పాటలతో. అదెలాగో చూద్దాం...



బోన్ కండక్షన్ టెక్నాలజీతో...

ఎవరికీ వినిపించకుండా మనకు మాత్రమే సంగీతం వినిపిస్తుందా... ఇదేదో మ్యాజిక్‌లా ఉందే అనుకుంటున్నారా? అబ్బే అదేం కాదు, దీని వెనుక ఏ మాయాలేదు, మంత్రం లేదు, అబ్బురపరిచే టెక్నాలజీ మాత్రమే ఉంది. అదే... బోన్ కండక్షన్ టెక్నాలజీ. లాలీపాప్‌ని కొరికినా, నాలుకతో తాకినా దానిలో అప్పటికే ప్రీలోడ్ చేసిన పాటలు శబ్దతరంగాల నుంచి వైబ్రేషన్స్‌గా మారి దవడ ఎముక నుంచి చెవిలోపల ఉండే కాక్లియర్ భాగానికి చేరుకుంటాయి. సాధారణంగా మనం వినే శబ్దాలన్నీ బయట చెవి నుంచి కర్ణభేరికి చేరి అక్కడ నుంచి మెదడుకు వెళతాయి. కానీ ఈ విధానంలో బయట మనకు కనిపించే చెవితోకానీ, కర్ణభేరితో కానీ ఏమాత్రం పని ఉండదు. పంటి నుంచి కానీ, దవడ ఎముక నుంచి కానీ లాలిపాప్‌లో ఉన్న పాటలు నేరుగా లోపలి చెవికి చేరిపోతాయి. అందుకే మనకి మాత్రమే ఈ సంగీతం వినబడుతుంది. 'అమ్మో ఇదేదో కొత్త టెక్నాలజీ, చెవులకు ఇబ్బందేమీ కాదు కదా' అనుకుంటున్నారా? దీంతో చెవులకు ఏమాత్రం ఇబ్బంది లేదు, ఎందుకంటే ఈ టెక్నాలజీని ఇప్పటికే మనం చికిత్సల్లో వాడుతున్నాం కాబట్టి. వినికిడి సమస్యలున్నవారికి హియరింగ్ ఎయిడ్స్‌లో ఈ టెక్నాలజీని వాడే శబ్దాలు వినబడేటట్టు చేస్తున్నారు. అలాగే, క్రీడాకారులకూ, ఈతకొట్టేవారికీ సాధారణ హెడ్‌సెట్స్ సౌకర్యంగా ఉండవు, పరుగుపెట్టినప్పుడు పడిపోయే అవకాశాలెక్కువ... నీళ్లలో సరిగా వినిపించవు కాబట్టి అక్కడా వీటినే ఉపయోగిస్తారు. ఎమర్జెన్సీ సమయంలో సమాచారం చేరవేయడానికి మిలటరీ వాళ్లూ తమకు మాత్రమే అర్థమయ్యేలా ఈ బోన్‌కండక్షన్ టెక్నాలజీనే వాడి సందేశాలు వింటూ ఉంటారు. ఈ టెక్నాలజీని వాడే ఆడియోలాలీపాప్స్‌నీ తయారుచేస్తున్నారు.

ఏ పాట కావాలన్నా...

ఈ లాలీపాప్స్‌తో ఏవో కొన్ని పాటలు కాదు, మనకు బాగా నచ్చిన ఏ పాటనైనా ఆస్వాదించవచ్చు. లవోలీ, లాలీట్యూన్, లాలీపాప్‌స్టార్, అమోస్‌టేస్టీ సౌండ్స్ లాంటి సంస్థలు అటు లాలీపాప్స్‌ని స్టాబెర్రీ, బ్లూబెర్రీ, కోలా వంటి రుచుల్లో అందిస్తూనే, కుర్రకారు ఇష్టపడే కె పాప్ ట్రాక్స్‌తోపాటు హాలీవుడ్‌లోని అనేక పాపులర్ పాటలని ప్రీలోడ్ చేసి ఇస్తున్నాయి. అవికాదు, మా అభిమాన గాయకుడూ, సంగీత దర్శకుడూ వేరే ఉన్నారు అనుకుంటే వాళ్లపాటలనీ కస్టమైజ్ చేసి అందించే సౌకర్యాన్ని కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. కొందరైతే పుట్టినరోజు కానుకగా ఇవ్వడానికి ప్రత్యేకంగా హ్యాపీబర్త్‌డే సాంగ్స్‌ని పొందుపరిచి ఈ లాలీ పాప్స్‌ని చేయించుకుంటున్నారు. వీటితో ఆరు నిమిషాలనుంచి గంటవరకూ సంగీతాన్ని వినొచ్చు.కొన్నిసంస్థలు పాడ్‌కాస్టింగ్ వినే సదుపాయం కూడా కల్పిస్తున్నాయి. ఆ సంగతి సరే, సంగీతం కోసం తీపి తిని మా ఆరోగ్యం పాడుచేసుకుంటామా అనుకునే వారికోసం... షుగర్ ఫ్రీ లాలీపాప్స్‌ని కూడా ప్రత్యేకంగా తయారుచేస్తున్నారు. అదన్నమాట విషయం, మరి ఇంకెందుకు ఆలస్యం.. ఒక లాలీపాప్‌ని మీరూ చప్పరించేయండి. సంగీత ఝరిలో మునిగితేలండి.



విటమిన్ ఎ ఎందుకంటే..

విటమిన్ ఎ అనేది కొవ్వులో కరిగే (ఫ్యాట్-సాల్యబుల్) విటమిన్. ఇది మన శరీరానికి చాలా ముఖ్యమైన పోషకం. మహిళల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చర్మ సంరక్షణని పట్టించుకునే యువతులు... అందరికీ ఇది అత్యవసరం. ఎందుకో తెలుసుకుందామా?

విటమిన్ ఎ రాత్రిపూట స్పష్టంగా చూడటానికి సహాయపడుతుంది. ఇది రెటినాలోని రోడోప్సిన్ అనే పదార్థం ఏర్పడటానికి అవసరం. దీని లోపం ఉంటే రేచీకటి వస్తుంది.

చర్మ కణాల పునరుత్పత్తికి సహాయపడుతుంది. మొటిమలు, పొడి చర్మం సమస్యలను తగ్గిస్తుంది. అందుకే దీన్ని రెటినాయిడ్ క్రీమ్‌లు, చర్మ సౌందర్య చికిత్సల్లోనూ వాడతారు.

విటమిన్ ఎ తెల్ల రక్త కణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. ఫలితంగా రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది. మీజిల్స్ వంటి వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.

శిశువు అవయవాలు (ముఖ్యంగా కళ్లు, ఊపిరితిత్తులు, గుండె) సరిగ్గా ఎదగడానికి విటమిన్ ఎ సహాయపడుతుంది. గర్భిణుల్లో రోగ నిరోధకతను పెంచుతుంది. అంతేకాదు... పాలిచ్చే తల్లులకు ఈ పోషకం రోజువారీ అవసరం మరింత ఎక్కువ. ఎందుకంటే... శిశువుకు తల్లిపాల ద్వారానే విటమిన్ ఎ అందుతుంది. అంతేకాదు...ఇది బీటా కెరొటిన్ రూపంలో క్యాన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

విటమిన్ ఎ సాధారణంగా రెండు రూపాల్లో లభిస్తుంది:

1. రెటినాల్: దీన్ని శరీరం నేరుగా ఉపయోగించుకుంటుంది. లివర్, ఫిష్ ఆయిల్, గుడ్లు (పచ్చసొన), పాలు, పెరుగు, వెన్న, చీజ్ వంటివాటి నుంచి ఇది లభిస్తుంది.
2. బీటాకెరొటిన్: ఇది శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది. ఇది నారింజ,ఎరుపు,ఆకుపచ్చరంగు కూరగాయలు/పండ్లు) అయిన క్యారెట్, బత్తాయి, పాలకూర, ఆకుకూరలు, మామిడి పండు, బొప్పాయి, బ్రాకలీ, క్యాప్సికం వంటివాటి నుంచి అందుతుంది.

MOVIE TIME



ఓటీటీలోనూ డబ్బులు పెట్టి చూడాల్సిందే


రామాయణ ఓటీటీ రిలీజ్‌లో మేకర్స్ ట్విస్ట్ ఇచ్చారు. థియేటర్లలో విడుదల కావడానికి ముందే ఈ భారీ బడ్జెట్ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులను జియో హాట్‌స్టార్ సొంతం చేసుకున్నది. ఓటీటీలో ఈ సినిమా ఫ్రీగా చూసేందుకు అవకాశం ఉండదని ప్రకటించారు. ఫే ఫర్ వ్యూ విధానంలో ఈ మైథాలజీ మూవీని రిలీజ్ చేస్తామని వెల్లడించారు. నాలుగు వేల కోట్లతో రెండు పార్ట్‌లుగా రూపొందిన ఈ సినిమాకు సంబంధించి ఓటీటీ రిలీజ్‌లో మెలిక పెట్టారు. రామాయణ గాథ ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో రణబీర్‌కపూర్, సాయిపల్లవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. నితీష్ తివారీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేమ్ యశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. నవంబర్ 5న పాన్ ఇండియా వైడ్‌గా ఐదు భాషల్లో ఈ సినిమా రిలీజ్ కాబోతుంది.

రామ్‌చరణ్‌తో సారా అర్జున్ జోడీ ?



రామ్‌చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మూవీ ఈ నెలలోనే ప్రారంభం కాబోతుంది. అక్టోబర్ 26 లేదా 27న పాన్ ఇండియన్ మూవీ ఓపెనింగ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించబోతున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా సారా అర్జున్‌తో పాటు మమితా బైజు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. దసరాకు ఈ మూవీ అఫీషియల్‌గా లాంఛ్ కావాల్సింది. కానీ మంచి రోజులు లేకపోవడంతో ప్రారంభోత్సవ వేడుకను వాయిదా వేసినట్లు నిర్మాత నవీన్ యెర్నేని ప్రకటించారు. సారాతో పాటు మలయాళ బ్యూటీ మమితా బైజు పేరు కూడా హీరోయిన్‌గా సడెన్‌గా ప్రచారంలోకి వచ్చింది. వీరిద్దరితో పాటు మరో మలయాళ హీరోయిన్ ప్రీతి ముకుందన్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు రూమర్లు వినిపిస్తున్నాయి. ఈ పుకార్లపై మూవీ ఓపెనింగ్ రోజే క్లారిటీ రానున్నట్లు సమాచారం. రామ్‌చరణ్ హీరోగా నటిస్తోన్న 17వ మూవీ ఇది.

ఓటీటీలోకి రుద్రవనం పీఎస్



నరేష్ అగస్త్య ప్రధాన పాత్రలో నటించిన క్రైమ్ ఇన్వేస్టిగేట్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ రుద్రవనం పీఎస్ ఈ నెల 30వ తేదీ నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్ కు శశిధర్ మున్నంగి దర్శకత్వం వహించారు. ఈ వెబ్‌సిరీస్‌లో బెనర్జీ, శివ అలపాటి, సుగాలి సిలోని, శ్రావణి రెడ్డి కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.



భర్త సినిమాలో హీరోయిన్‌గా కియారా

బాలీవుడ్ రియల్‌లైఫ్ కపుల్ సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ ఐదేళ్ల తర్వాత కలిసి సిల్వర్ స్క్రీన్‌పై కనిపించబోతున్నట్లు సమాచారం. వీరిద్దరు కలిసి ఓ బయోపిక్ సినిమా చేస్తోన్నట్లు వార్తలొస్తున్నాయి. సిద్ధార్థ్, కియారా కాంబినేషన్‌లో గతంలో షేర్‌షా మూవీ వచ్చింది. 2021లో రిలీజైన ఈ మూవీ నేషనల్ అవార్డును గెలుచుకుంది. అలనాటి దిగ్గజ బాలీవుడ్ నటి మీనా కుమారి జీవితం ఆధారంగా ఓ బయోపిక్ మూవీ రూపొందుతోంది. టాప్ హీరోయిన్‌గా చెలామణి అయిన మీనాకుమారి 38 ఏళ్ల వయసులోనే ఎలా కన్నుమూసింది ? డైరెక్టర్ కమల్ అమ్రోహీతో ఆమె విఫల ప్రేమాయణంతో ఈ బయోపిక్ రూపొందుతోన్నట్లు సమాచారం. ఈ సినిమాలో మీనా కుమారి పాత్రలో కియారా అద్వానీ కనిపించబోతున్నట్లు చాలా కాలంగా వార్తలొస్తున్నాయి. కమల్ అమ్రోహీ క్యారెక్టర్ కోసం సిద్ధార్థ్ మల్హోత్రాను హీరోగా ఎంపికచేసినట్లు సమాచారం.

తెలంగాణ ప్రేమకథతో మరో మూవీ



తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో టాలీవుడ్‌లో మరో సినిమా రాబోతుంది. బబ్లూ డబల్ ఎక్స్ఎల్ పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు రాజు వెడ్స్ రాంబాయి ఫేమ్ సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో మిస్ కేరళ గహాజీ ఎస్‌కే హీరోయిన్‌గా నటిస్తోంది. మంచిర్యాల సిటీ బ్యాక్‌డ్రాప్‌లో యూత్‌ఫుల్ ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రూపొందుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.